

కార్మికవర్గాన్ని మోసపుచ్చేలా ప్రభుత్వ విధానాలు

'సిటు' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు / నేటి నుంచి తిరుపతిలో సిఐటియు రాష్ట్ర సమావేశాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బోగస్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని, కార్మికవర్గాన్ని మోసపుచ్చేలా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. తిరుపతిలో 10–13 తేదీల్లో సిఐటియు నాయకత్వం కార్మిక సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. తిరుపతి సిఐటియు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ గ్యారంటీ పెన్షన్ స్కీం (జిపిఎస్)లో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ గ్యారంటీ ఏమీ లేదన్నారు. దీనిని అందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలోఉన్న 10శాతం కార్మికులకు చెల్లించాలనే విధానమే ఇందులోనూ ఉందన్నారు. ఇది నేతిబీరకాయలో నెయ్యి చందంగా ఉందన్నారు. కాంట్రాక్టు కార్మికులను 10,117 మందిని పర్మినెంట్‌చేస్తామని ప్రకటించారని, అయితే పాదయాత్రల్లోనూ, వైఎస్ఆర్ పార్టీ ఎన్నికల ప్రణాళికలోనూ 2.4 లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్‌చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. నేషనల్ హెల్త్ మిషన్, మున్సిపల్, టిటిడి, స్విమ్స్ ఆసుపత్రి, ఉపాధి పథకం, వెలుగు ఐకెపి, కస్తూరిబా విద్యా కేంద్రం, ప్రభుత్వరంగ సంస్థలలో ఒక్క కాంట్రాక్ట్ కార్మికుడూ పర్మినెంట్ కావడం లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయడం వాస్తవానికి బోగస్ అని తెలిపోయిందన్నారు. యూనివర్శిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు

పిఆర్సి జీతాలు అమలు చేయకపోవటం, వయస్సు పరిమితిని 62 సంవత్సరాలకు పెంచకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో దేశంలో ప్రథమ స్థానంలో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తోందన్నారు. టిటిడిలో పాతికేళ్లకు పైగా పనిచేస్తున్న అటవీ కార్మికులు క్రమబద్ధీకరణ చేయాలని 945 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నారన్నారు. స్కీం వర్కర్ల జీతాలు పెంచాలని ఆందోళన చేస్తున్నా తెలంగాణాతో సమానంగానూ పెంచలేదన్నారు. ఉద్యోగ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలపై సిఐటియు రాష్ట్ర సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించడానికి తిరుపతి వేదిక కాబోతుందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, కోశాధికారి కేఎన్ఎన్ ప్రసాదరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ఎన్. వాణిశ్రీ,, టిటిడి ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షులు జి. వెంకటేష్, ఎపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ జి. నాగవెంకటేష్ పాల్గొన్నారు.

స్విమ్స్ నెఫ్రాలజి విభాగంలో డయాలసిస్ బ్యాగుల కొరత

టెలీ మెడిసిన్ వ్యవస్థ ప్రారంభించాలి : ఈవో

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కిడ్నీ వ్యాధులతో బాధపడే వారికి తగిన సలహాలు, సూచనలు, వైద్య సహాయం అందించడానికి నెఫ్రాలజి విభాగంలో టెలీ మెడిసిన్ వ్యవస్థను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి స్విమ్స్ అధికారులను ఆదేశించారు. టీటీడీ జేఈవో సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మతో కలసి శుక్రవారం ఆయన నెఫ్రాలజి, యూరాలజి విభాగాలను సందర్శించారు. ఇన్‌పేషంట్ వార్డులు, డయాలసిస్ వార్డులు, ఐసియూ విభాగాలను పరిశీలించారు. ఇక్కడ అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఇంటి వద్దే డయాలసిస్ చేసుకునే అవకాశం ఉండి ఆసుపత్రికి వస్తున్న రోగుల గురించి ఈవో వివరాలు తెలుసుకున్నారు. డయాలసిస్ కోసం ఉపయోగించే బ్యాగులకు డిమాండ్ ఉందని డాక్టర్లు చెప్పారు. ఏపీ ఎం ఐడిసి చైర్మన్ డాక్టర్ చంద్ర శేఖర్‌రెడ్డితో ఈవో అక్కడి నుండే ఫోన్‌లో మాట్లాడి స్విమ్స్‌కు డయాలసిస్ బ్యాగులను పంపాలని కోరారు. రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న పిల్లలకు పెన్షన్ రావడం లేదని బాధితుల కుటుంబీకులు ఈవో దష్టికి తెచ్చారు. పెన్షన్ మంజూరు చేయించడానికి తమవైపు నుంచి సహాయం చేస్తామని ఈవో చెప్పారు. స్విమ్స్ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న టిఫిన్, భోజనం నాణ్యత గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఈవో ఆయా విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఐటి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి సంబంధించిన ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేయించుకోవాలని సూచించారు. నెఫ్రాలాజి, యూరాలజి విభాగాల పనితీరు బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎఫ్ఏసీఏవో బాలాజి, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, యూరాలజి విభాగాధిపతి డాక్టర్ అనిల్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగరాజు, జిఎం సురేష్ కుమార్, టీటీడీ ఐటి జిఎం సందీప్, ఈఈ ప్రసాద్, నర్సింగ్ ఎడి ప్రభావతి పాల్గొన్నారు.

తొమ్మిది మంది తహశీల్దార్ల బదిలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, తిరుపతి టౌన్

తిరుపతి జిల్లా రెవెన్యూ శాఖలో ఉద్యోగులను భారీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అవుతున్న వారిలో తొమ్మిది మంది తహశీల్దార్లు, 20 మంది డెప్యూటీ తహశీల్దార్లు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు ఉండడం గమనార్హం. తిరుపతి రూరల్ మండల తహశీల్దార్ లోకేశ్వరి చిన్నగొట్టిగల్లుకు, చిన్నగొట్టిగల్లు తాహశీల్దార్ హనుమాన్ నాయక్ బుచ్చినాయుడు కండ్రిగకు, బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం తిరుపతి రూరల్ మండలంకు, శ్రీకాళహస్తి తహశీల్దార్ జరీనా సత్యవేడుకు, సత్యవేడు తహశీల్దార్ శ్రీదేవి కెవిబిపురంకు, కేవీబీపురం తహశీల్దార్ ద్వారకానాథ రెడ్డి ఏర్పేడుకు, ఏర్పేడు తహశీల్దార్ ఉదయ్ సంతోష్ తిరుపతి కలెక్టరేట్ కు, నాయుడుపేట తహశీల్దార్ పరమేశ్వర స్వామి పుత్తూరుకు, పుత్తూరు తహశీల్దార్ రోశయ్యను తిరుపతి కలెక్టరేట్ కు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాలో 20 మంది డిప్యూటీ తాసిల్దారులు బదిలీ అయ్యారు. ఇందులో పాకాల డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేసిన ఈ హరికృష్ణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా తిరుపతికి బదిలీ అయ్యారు. నారాయణ వనం డిప్యూటీ తాసిల్దారుగా పనిచేస్తున్న టీ పరదేసయ్య పాకాలకు బదిలీ అయ్యారు. .చిన్నగొట్టిగల్లు డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న ఓకే .రోజా రాణి తిరుపతి పౌర సరఫరాల శాఖకు, జిల్లా స్టీల్ సప్లై కార్యాలయంలో పనిచేస్తున్న ఎం అన్వర్ భాష చిన్న గొట్టిగల్లుకు బదిలీ అయ్యారు .వడమాల పేట డిప్యూటీ తాసిల్దారుగా పనిచేస్తున్న పి రేఖ తిరుపతి జిల్లా సివిల్ సప్లైకు పుత్తూరు డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న డి రవికుమార్ వడమాల పేటకు, సత్యవేడు డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న ఆర్ వెంకటేశ్వర్లు తిరుపతి జిల్లా సివిల్ సప్లై కార్యాలయానికి బదిలీ అయ్యారు .శ్రీకాళహస్తి డిప్యూటీ తాసిల్దార్ ఎం మోహన్ బాబు పాకాలకు బదిలీ అయ్యారు. నారాయణ వనం డిప్యూటీ తాసిల్దార్ కిరణ్ మై తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖకు. వడమాలపేట డిప్యూటీ తాసిల్దార్ ఏ .జాన్ జయరాజ్ స్టీల్ సప్లై శాఖ డిప్యూటీ తాసిల్దారుగా బదిలీ అయ్యారు. ఏర్పేడు డిప్యూటీ తాసిల్దార్ ఎం శివకుమార్ తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖకు, నాగలాపురం డిప్యూటీ తాసిల్దార్ లక్ష్మీనారాయణ తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖకు బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖలో పనిచేస్తున్న జి శ్యాం ప్రసాద్ గాలేరు నగిరి ప్రాజెక్టు భూసేకరణ విభాగానికి బదిలీ అయ్యారు. చంద్రగిరి డిప్యూటీ తాసిల్దార్ ఎం ఈశ్వర్ రెడ్డి తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖకు, చిన్న గొట్టికల్లు డిప్యూటీ తాసిల్దార్ సి మోహన్ రెడ్డి చంద్రగిరి కి, .రామచంద్రపురం డిప్యూటీ తాసిల్దార్ జె ముని సాయి లాజ చంద్రగిరి ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ గా బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా లో వెయిటింగ్ జాబితాలో ఉన్న పి స్వామినాథన్ తిరుపతి జిల్లా ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.సత్యవేడు డిప్యూటీ తాసిల్దార్ గా పనిచేస్తున్న బి రెడ్డి నాగార్జున తిరుపతి జిల్లా సివిల్ సప్లై శాఖకు బదిలీ అయ్యారు.

కెన్యాలోని 'కిసుము' రాష్ట్రంతో...

వేలూరు 'నరువి' ఒప్పందం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

కెన్యాలోని 'కిసుము' రాష్ట్రంతో వేలూరులోని నరువి ఆసుపత్రి ఒప్పందం కుదుర్చుకుంది. తమ దేశానికి చెందిన రోగులకు రేడియాలజీ, న్యూరాలజీ, కాన్సర్ చికిత్స, వైద్యం అందజేయడానికి ఈ ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. కిసుము రాష్ట్ర గవర్నరు, కెన్యా మాజీ క్యాబినెట్ మినిస్టర్ ప్రొఫెసర్ అన్యాంగ్ నియోంగో ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ వెస్ట్రన్ కెన్యాలోని కిసుము దేశంలోని ప్రజలకు అనారోగ్యానికి వైద్యం అందలేక పోతోందని, కిసుము రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్యం అందజేయడానికి నరువి ఆసుపత్రితో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. వైద్య రంగంలో భారతదేశం ముందంజలో ఉందని, ముఖ్యంగా ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రపంచ స్థాయిలో భారత్ గుర్తింపు పొందిందన్నారు. తాము భారతదేశంలోని నరువి లాంటి ఆసుపత్రుల నుంచి అధ్యయనం చేయాల్సినవి చాలా ఉన్నాయన్నారు. నరువి ఆసుపత్రి ఎండీ డాక్టర్ సంపత్ మాట్లాడుతూ బోన్ మారో, కాన్సర్ చికిత్స కోసం కిసుము రాష్ట్ర డెలిగేషన్ తమతో సంప్రదించారని, కిసుము రాష్ట్రం అంతర్జాతీయ సమావేశానికి ఆతిథ్య మిస్తున్నట్లు తెలిపారు.

అందులో నరువి ఆసుపత్రి పాల్గొనడమే కాకుండా కొంత మంది వైద్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నరువిలో వివిధ దేశాల నుంచి వస్తున్న రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా దేశంలోని అస్సాం, మణిపూర్, మేఘాలయ, నాగలాండ్ లతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాల నుంచి కూడా రోగులు చికిత్స కోసం వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జార్జ్ రే, ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్జున్ దాస్ గదికి పంచనామా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

హథీరాంజీ మఠాధిపతి అర్జున్ దాస్ ను ధార్మిక పరిషత్ సస్పెండ్ చేసిన నేపథ్యంలో పరిషత్ ఆదేశాలను అర్జున్ దాస్ కు అందివ్వడానికి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రామకష్ణారెడ్డి వెళ్లగా ఆయన అందుబాటులో లేరని అక్కడి వారు సమాధానమిచ్చారు. దీంతో రెవిన్యూ అధికారుల సహాయంతో అర్జున్ దాస్ గది వద్ద పంచనామా నిర్వహించి ధార్మిక పరిషత్ ఆదేశాలను గోడలకు అతికించారు.

వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి టౌన్ : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో 51 వాలంటీర్ల పోస్టులు ఖాళీగా వున్నాయని, అర్హులైన వారు ఈ నెల 18వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. దరఖాస్తుదారులు తిరుపతి పరిధిలో నివాసితులై 10 పాసై వుండాలన్నారు. ప్రభుత్వ నిబందనల మేరకు నియమించుకొను వాలంటీర్ల సంఖ్యలో 50 శాతం మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. నెలకు ఐదువేలు గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు.

తిరుపతి - నెల్లూరు మధ్య ఎలక్ట్రిక్ బస్సులు

సర్వీసులు ప్రారంభించిన ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నెల్లూరు జిల్లా ప్రజలకు విద్యుత్ ఏసి బస్సుల సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏ పీ ఎస్ ఆర్ టి సి) ఛైర్మన్ ఏ.మల్లికార్జున రెడ్డి శుక్రవారం నెల్లూరు – తిరుపతి మధ్య ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి– నెల్లూరు మధ్య 12 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఆరు బస్సులు నిర్ణీత సమయంలో నెల్లూరు నుంచి బయలుదేరితే మరో ఆరు బస్సులు తిరుపతి నుంచి ప్రారంభం అవుతాయి. ఇప్పటికే ఏ పీ ఎస్ ఆర్ టి సి ఓలెక్ట్రా గ్రీన్టెక్ సంస్థకు చెందిన 50 బస్సులను తిరుపతి–తిరుమల మధ్య నడుపుతోంది. కొద్దీ రోజుల క్రితం తిరుపతి– కడప మధ్య కూడా ఎలక్ట్రిక్ ఏ సి బస్సుల సేవలు ప్రారంభం

అయ్యాయి. తాజాగా నెల్లూరు– తిరుపతి రూట్లో ఓలెక్ట్రా గ్రీన్ టెక్ ఏ సి విద్యుత్ బస్సుల సేవలను ఏ పీ ఎస్ ఆర్ టి సి ప్రారంభించింది. ఈ బస్సులో డ్రైవర్ సహా 35 మంది ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంది. ట్రాఫిక్, ప్రయాణికుల సామర్థ్యాన్ని బట్టి ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్లు ఈ బస్సులు ప్రయాణం చేస్తాయి ఈ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ హితమే లక్ష్యంగా ఆర్ టి సీ విద్యుత్ బస్సులను ప్రవేశ పెడుతోందని చెప్పారు. త్వరలో మరిన్ని పట్టణాల నుంచి విద్యుత్ బస్సుల సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటికే తిరుపతి–తిరుమల, తిరుపతి–కడప మధ్య రాకపోకలు సాగిస్తున్న విద్యుత్ బస్సులకు మంచి ఆదరణ లభిస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఎస్ ఆర్ టి సి జోనల్ ఛైర్మన్ బత్తుల సుప్రజ, ప్రజరవాణా శాఖ, ఓలెక్ట్రా గ్రీన్ టెక్ అధికారులు పాల్గొన్నారు.



ముగిసిన వేసవి శిక్షణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

స్థానిక అన్నమయ్య సర్కిల్ నందు (అల్ ఇండియా రేడియో వెనకాల) వున్న ప్రభుత్వ గ్రేడ్ –1 శాఖా గ్రంథాలయంలో నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నైనార్ మదుబాల మాట్లాడుతూ ఈ శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తక పఠనం అలవర్చుకోవడం వలన సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. విశిష్ట అతిథి, ఆర్ ఐ వెంకటరమణ మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోను పక్కన పెట్టి, పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తాను చిన్నతనం నుండి గ్రంథాలయంలో చదివి ఈ స్థాయికి వచ్చానన్నారు. సభాధ్యక్షులు నడ్డి నారాయణ మాట్లాడుతూ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని పిల్లలందరూ చాలా చక్కగా వినియోగించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఇంతటి అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులకు చేరువు చేసినటువంటి ఈ గ్రంథాలయ చైర్పర్సన్ మైనర్ మధుబాలని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దామోదరం, పి గోపాల్, ముషీర్ అహ్మద్, మల్లేశ్వర రావు, కడివేటి మునిరత్నం, ఉపాధక, రెడ్డి ప్రసాద్, రవి, లోకేష్, జే శివప్రసాద్ పాల్గొన్నారు.

గగనతలంలో విమానాలు సంచరించడంపై టిటిడి దృష్టి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల గగనతలంలో గురువారం ఉదయం 7.45, 8, 8.22 గంటలకు మూడు విమానాలు సంచరించాయి. దీంతో టిటిడి అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించారు. శ్రీవారి ఆలయ గగనతలం నుంచి విమానాలు వెళ్లడం నెల రోజుల వ్యవధిలో ఇది మూడోసారి కావడంతో భక్తులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగమశాస్త్రాల ప్రకారం తిరుమల ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడం నిషిద్ధం. విమానాల రాకకు అడ్డుకట్ట వేసేలా శ్రీవారి ఆలయ గగనతలాన్ని 'నో ఫ్లై జోన్'గా ప్రకటించాలని పౌర విమానయాన శాఖకు టీటీడీ గతంలోనే విజ్ఞప్తి చేసింది. కానీ, ఈ దిశగా ఆశించిన పురోగతి మాత్రం లేదు. దీంతో, విమానాలు వచ్చి వెళ్లిన ప్రతిసారీ టీటీడీ వర్గాలు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాల్సి వస్తోంది.

రోగులను బతికించే కాన్సెప్ట్ 'మహిషాసురుడు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఒక పేషెంట్ కు అయ్యే వైద్య ఖర్చుతో పదిమంది రోగులను బతికించే కాన్సెప్ట్ తో మహిషాసురుడు సినిమా చిత్రీకరించామని ప్రముఖ కార్డియాలజిస్ట్, చిత్ర హీరో డాక్టర్ గురు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ రీసెర్చ్ పై రోగులకు ఉపయోగపడే విధంగా సినిమాకు కావలసిన అన్ని అంశాలను మహిషాసురుడు సినిమాలో చూపించామన్నారు. ఆదివారం తిరుపతిలో రిలీజ్ అవుతున్న మహిషాసురుడు చిత్రాన్నీ ప్రతి ఒక్కరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రముఖ వైద్యులు దగ్గుబాటి శ్రీహరిరావు, యుగంధర్, హరి, కథానాయకి స్వప్న పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలు నిర్ణయించుకోవాలి

ప్రజాశక్తి - క్యాంపస్

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేందుకు విద్యార్థి దశలోనే నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, విజయం సాధించేవరకరూ విరామం ఇవ్వరాదని అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజని పిలుపునిచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులతో శుక్రవారం "ఇంటరాక్షన్ విత్ రజని" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారి రజని మాట్లాడుతూ, తాను తిరుపతిలోనే చదివి నిరంతర శ్రమతో అనేక పరాజయాల నడుమ అంతర్జాతీయ క్రీడాకారిణిగా విజయం సాధించానని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దయతో తాను ఈ స్థాయికి చేరుకోగలిగానన్నారు. జీవితంలో సమస్యలు ఎన్ని వచ్చినా వెనుకంజవేయకుండా లక్ష్యసాధన దిశగా

శ్రీ పద్మావతి జూనియర్ కళాశాలలో హాకీ క్రీడాకారిణి రజని

దూసుకుపోవాలని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు మానసికంగా అత్యంత ధైర్యంగా ఉండి సమస్యలను ఎదిరించాలని చెప్పారు. తన జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన విధానాన్ని హాకీలోని మెలకువలను, క్రీడల వల్ల లభించే కీర్తి ప్రతిష్టలను,ఉన్నత ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. డిఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిరంతరం గుర్తు పెట్టుకోవాలని చెప్పారు . జీవితంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా నిరాశ చెందకూడదన్నారు . అకుంఠిత దీక్ష, శ్రమతో ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కోవచ్చున్నారు. విద్యార్థులకు టీటీడీ అందించే సౌకర్యాలను ఉపయోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ ప్రసంగించారు. శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మస్తాక్ అహ్మద్, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, డాక్టర్ భీమన్న, కిరణ్ కుమార్, రామకష్ణారెడ్డి, విజయశ్రీ, పాల్గొన్నారు.

గృహనిర్మాణాల జాప్యంపై కలెక్టర్ మండిపాటు

ప్రజాశక్తి - తిరుపతి

నగరపాలక పరిధిలో గహనిర్మాణాల పనితీరు పట్ల కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగంగా జరగడంలేదని, ఇచ్చిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయడంలేదని, ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సంబంధిత అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. శుక్రవారం నగర పాలక పరిధిలో నిర్మాణాలు జరుగుతున్న గృహాల పురోగతిపై కమిషనర్ హరితతో కలిసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గహనిర్మాణాలకు నీరు , మెటీరియల్ , అప్రోచ్ రోడ్లు సౌకర్యం వుందని లేబర్ కూడా అందుబాటులో వున్నారని ప్రణాళికా బద్ధంగా లక్ష్యాలు నిర్దేశించి ప్రతి రోజూ కనీసం స్టేజ్ కన్వర్షన్ పై మూడు సార్లుగా

సమీక్షించాలని సూచించారు. మరో మూడు నెలల్లో వర్షాలు వస్తే మరల పనులు ఆగుతాయని నోడల్ అధికారి నియామకంతో గహనిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థలో మంజూరుచేసి కేటగిరి 3 తో కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణాలు జరుగుతున్న చిందే పల్లి , జి.పాలెం , కల్లూరు , ఎం.కొత్తపల్లి , సూరప్పకశం , పిసి అగ్రహారం లే ఔట్లలో వసతులు పై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ , డిఇ లు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్ , గోమతి , దేవిక , మహేష్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

కూలిన విద్యుత్తు స్తంభం

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుపతికి కూతవేటు దూరంలోని తిరుచానూరుకు సమీపంలో భారీ గాలీవానకు యోగి మల్లవరం భువనేశ్వరి స్కూల్ వద్ద భయానక వాతావరణం నెలకొంది. భారీ వర్షం ఈదురుగాలికి కొబ్బరి చెట్టు స్కూల్ వ్యాన్ పక్కన నెలకొరిగింది. అదష్టవశాత్తు ఆ సమయంలో పిల్లలు ఎవరూ లేరు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం కూలి సర్వీస్ వైర్లు రోడ్లు పై వేలాడాయి. దీంతో స్కూలు యాజమాన్యం, స్థానికులు విద్యుత్ శాఖకు ఫిర్యాదు చేశారు. ప్రాణనష్టం జరగకుండా యుద్ధప్రాతిపదికన సకాలంలో చర్యలు తీసుకోవాలని కోరారు.

దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-సత్యవేడు: దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణలో రైతులు సహకరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. భూ సర్వే ప్రక్రియలో భాగంగా శుక్రవారం నాగలాపురం మండలం సురుటుపల్లి కస్తూరినాయుడు కండ్రిక వద్ద బైపాస్ రోడ్డు ప్రతిపాదిత మార్గంలో సెంటర్ హద్దురాయిని ఆయన వేసి భూ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం ఐదు దశాబ్దాల ప్రజల ఆకాంక్ష అన్నారు. గతంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం వేసినా అప్పటి రాజకీయ నేతల కుతంత్రాలు కారణంగా కార్యాచరణలోకి రాలేదన్నారు. అయితే తాను ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణం నుంచి దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే దీనిపై కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడంతో నేటికీ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే ఐదు దశాబ్దాల బైపాస్ రోడ్డు నిర్మాణ కల నెరవేరాలంటే రైతులందరూ సహకరించడం తప్పనిసరి అన్నారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఇళ్లు పూర్తిగా కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించడం జరుగుతుందన్నారు. దాసుకుపం బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కొందరు రైతులను రెచ్చగొట్టడం సబబు కాదన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం లేకపోవడంతో ప్రతి వాహనం తమిళనాడులోని ఊతుకోట మీదుగా వెళ్లాల్సి వస్తోందని.. దీంతో వాహనదారులకు తమిళనాడు పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. దీంతో రూ.లక్షల్లో పన్ను తమిళనాడు ప్రభుత్వానికి చేరుతున్నట్లు చెప్పారు. దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే సరిహద్దు ప్రాంతంలో భూముల విలువ భారీగా పెరుగుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భూసర్వే సెంటరు హద్దురాయిని కస్తూరి నాయుడు కండ్రిక వద్ద వేశారు. అనంతరం మహిళలు కొందరు తమ భూములు రోడ్డు నిర్మాణంలో పోతున్నట్టు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దష్టికి తీసుకొచ్చారు. దీనిపై భూములు కోల్పోతున్న వారందరికీ పరిహారం చెల్లిస్తామని, అధైర్య పడాల్సిన పని లేదన్నారు. సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ అపరంజిరాజు, పిచ్చాటూరు పాల పద్మనాభం, సత్యవేడు చంద్రశేఖర్ రెడ్డి, దాసుకుప్పం సర్పంచ్ రవిరెడ్డి, సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు సురేష్, మాజీ సభ్యులు జయప్రకాష్, నాయకులు సింధు శ్యామ్, సుబ్రహ్మణ్యం, మణి, సురుటుపల్లి వీఆర్వో సుకుమార్, నాగభూషణం, చంద్రిక, సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

ఒడిస్సా రైలు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఒడిస్సా రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యుడు చింతామోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైల్వే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గూడూరు రైల్వే స్టేషన్ వద్ద తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిస్సా ప్రమాదంలో సుమారు 1000 మంది ప్రయాణికులు చనిపోతే కేవలం 300 మాత్రమే మరణించారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వాకాడు మండలంలో దుగరాజపట్నం పోర్టు నిర్మాణం జరగాలని.. మన్నవరంలో భెల్ కర్మాగారం నిర్మాణాన్ని పూర్తి చేయాలని.. యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంట శ్రీనివాసులు రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, వేమయ్య పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు అన్నదానం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రోగులు, గర్భిణులకు అన్నదానం చేశారు. పండ్లు, మజ్జిగ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణులకు అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. తహసీల్దార్ హనుమంత నాయక్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేస్తున్న ప్రెస్‌క్లబ్ టీమ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేణు, గౌరవాధ్యక్షులు ప్రసాద్, డీటీ శివయ్య, వైద్యులు దివాకర్, సాక్షి రిపోర్టర్ శివయ్య, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు దయాకర్, పీఆర్వో కోటేశ్వరరావు, ట్రెజరర్ వైఎస్ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తుల సేకరణ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: యర్రావారిపాలెంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ బాలాజీ శుక్రవారం పరిశీలించారు. ఉదయ మాణిక్యం పంచాయతీ గడ్డంవారిపల్లిలోని రైతు సంఘాల సభ్యులతో జాయింట్ కలెక్టర్ మాట్లాడారు. మామిడి ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. మామిడి మార్కెటింగ్, ఎగుమతులపై రైతులతో చర్చించారు. ప్రస్తుతం టన్ను తోతాపురి జ్యూస్ రకం రూ.15 వేలు, కలర్ రకం రూ.20 నుంచి 25 వేలు, బేనీషా రకం టన్ను రూ.20 నుంచి రూ.30 వేలు వరకు ధరలు ఉన్నట్లు తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడితే దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా మార్కెటింగ్ చేసుకొని మంచి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు స్తగిరయ్య, ఉద్యానవన శాఖ అధికారి శివకుమారి, వ్యవసాయ శాఖ అధికారి ఖాదర్ బాషా, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ శివాని స్టడీసర్కిల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గూడూరు: ఏపీఆర్‌జేసీ ఫలితాలలో తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రవేశ పరీక్ష ఫలితాలలో శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్టడీ సర్కిల్ విద్యార్థి పెంచల ప్రగ్నేష్ రాష్ట్ర స్థాయిలో 230 ర్యాంకు, ఎస్ కె. ఫహీమ్ 380, డి.మేఘన 500 రాంకులతో పాటు 26 మంది విద్యార్థులు సెట్ ర్యాంకులు సాధించారని వివరించారు.

రూ.50 లక్షలతో ఆసుపత్రిలో అదనపు భవనాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం అదనపు భవనాల నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. శుక్రవారం వైసీపీ నాయకులు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, డివిజనల్ ఇంజినీర్ బందిలి రమణయ్య , ఏఈ, వైద్యాధికారి చైతన్య కలిసి భవన నిర్మాణాలకు స్థల పరిశీలన చేశారు. సర్పంచి బ్లెస్సీ, ఎంపీటీసీ దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎస్‌టీయూ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి నగర పరిధిలోని ఎస్టీయూ భవన్‌లో పశ్చిమ రాయలసీమ పూర్వ శాసన మండల సభ్యులు కత్తి నరసింహారెడ్డి ఎస్టీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నవాబుల నిరంకుశ పాలనలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం స్వాతంత్రం రాక మునుపే ఎస్టీయూ సంఘాన్ని మగ్దూం మొహిదీన్ ఏర్పాటు చేశారన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిత్యం కషి చేసిన వ్యక్తి మొహిద్దిన్ అన్నారు. కార్యక్రమంలో ఎస్టియు నాయకులు ధనుంజయ నాయుడు, మునికష్ణ నాయుడు, వేణు, జగన్నాథం, రామాంజనేయులు, రమాదేవి, మధుసూదన్ రాజు, మురళి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమృత సరోవర్ పనులు భేష్..!

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జరుగుతున్న అమృత సరోవర్ పనులు బాగున్నాయని ఏపీడీ ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పల్లమాల్ల పంచాయతీలోని పాపన్నగుంట చెరువులో జరుగుతున్న అమత సరోవర్ పనులను సీఆర్‌డీ స్పెషల్ టీమ్ పరిశీలించింది. చెరువు పనులతో స్థానిక రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని సర్పంచ్ వెంకట రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పలమల గోపాల్ రెడ్డి, ఏపీవో భానుప్రియ, జేఈ మధుసూదన్ రావు, మస్తాన్, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనాల పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వాకాటి రామమోహన్‌రావు దాతత్వంతో శుక్రవారం ఉదయం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ రాజేష్ కుమార్, చెంచు నారాయణ, పురుషోత్తం, కటకం శ్రీనివాసులు, విజయ్ బాబు, రాధయ్య, మురళి, సింగ్, సుబ్రహ్మణ్యం, బాబు, వెంకట్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే చర్యలు

ప్రజాశక్తి-గూడూరు: వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని.. ఆపద సమయంలో హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని, ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని గూడూరు వన్ టౌన్ సీఐ హజరత్ బాబు తెలిపారు. పట్టణంలోని సంగం కూడలి వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. పలు వాహనాలకు జరిమానాలు విధించారు.

ఓటర్ల వివరాలను సరిచూసుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఓటు నమోదు, తొలగింపు, పేర్ల మార్పులు, చేర్పులు వివరాలను తప్పనిసరిగా సరిచూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎం రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్‌ఆర్ భవనంలో బీఎల్‌వోలతో సమావేశమయ్యారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

వేసవి శిక్షణ శిబిరం తనిఖీ

ప్రజాశక్తి- తొట్టంబేడు: తొట్టంబేడు గ్రంథాలయం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ నైనార్ మధుబాల శుక్రవారం తనిఖీ చేశారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి హరికృష్ణ, ఉపాధ్యాయులు రమణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-గూడూరు: ప్రయాణీకులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం తిరుపతి జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన గూడూరు ఆర్టీసీ డిపోను పరిశీలించారు. డిపో మేనేజర్, ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ప్రయాణీకులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. గూడూరు నుండి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. అలాగే ఇటీవల నెల్లూరులో ప్రయాణీకుల సౌకర్యార్థం 12 ఎలక్ట్రిక్ బస్సులను ఛైర్మన్ భల్లికార్జున్ రెడ్డి, జోనల్ ఛైర్మన్లు ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే గూడూరు నుంచి తిరుమలకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో బస్సు ఏర్పాటు చేశామన్నారు. రెండు ఏసీ బస్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు.

కోర్ట్ ఆఫ్ లా అవగాహన చేసుకోవాలి

ప్రజాశక్తి-క్యాంపస్: న్యాయ విద్యార్థులు కోర్ట్ ఆఫ్ లా గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలి అని సుప్రీం కోర్ట్ బార్ అసోసియేషన్, న్యూఢిల్లీ అధ్యక్షుడు ఆదిష్ అగర్వాల్ పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఐదు సంవత్సరాలకు కోర్స్ న్యాయ విద్యార్థులకు సెనేట్ హాల్లో ఒక్కరోజు అతిథి ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు రాజ్యాంగంపై పూర్తిగా అవగాహనతో.. నిబద్ధతతో రాజ్యాంగంలోని ప్రతి సెక్షన్ గురించి అవగాహన చేసుకోవాలన్నారు. అలాగే న్యాయ విద్యార్థులు సుప్రీంకోర్టు న్యాయ వివాదాలు, వాటి పరిష్కారాలపై దృష్టి సారించాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఒ.ఎమ్ డి హుస్సేన్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు క్రమశిక్షణతో తరగతులకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి పద్మనాభం, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ మురళీధర్, ఒప్పంద అధ్యాపకులు నిర్మల, అంజన్ సింగ్, భవ్య, శ్రీలక్ష్మి, అమరేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక మాఫీయాను అరికట్టాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు నియోజకవర్గంలో అక్రమ సిలికా, ఇసుక మాఫీయాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమితి సమావేశానికి జిల్లా కార్యదర్శి హాజరయ్యారు. నిత్యం ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో విచ్చలవిడిగా అనుమతులు లేకున్నా అక్రమ సిలికా, ఇసుక రవాణా నిత్యకత్యాలుగా మారాయన్నారు. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తమ దష్టికి వచ్చిందన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఇసుక లభించక అల్లాడుతుంటే ఇసుక, సిలికా మాఫియాగా మారి పక్క రాష్ట్రాలకు తరలించడం అన్యాయమన్నారు. వెంటనే సిలికా, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ అరాచకాలకు హద్దే లేకుండా పోయిందన్నారు. పాలకులు దళితులు, మైనారిటీలను లక్ష్యంగా దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. పెట్రో, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, పన్నుల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలు అల్లాడిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్. ప్రభాకర్, సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపకార్యదర్శి షేక్. జమాలుల్లా, నియోజకవర్గ సమితి సభ్యులు సీతా భాస్కర్, రఘురామయ్య, మస్తానయ్య, యాకోబు, శ్రీనివాసమూర్తి, హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం అందరి సామాజిక బాధ్యతని శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు పిలుపునిచ్చారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ప్రగతి సంస్థ (తిరుపతి) ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక నిర్మూలన దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని కరపత్రాలు, గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలను ఎవరూ పనికి పెట్టుకోరాదని, అలా ఎవరైనా చేశారని తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రగతి సిబ్బంది ప్రభాకర్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

రేణిగుంట: బాల కార్మిక చట్టాలు కఠినమైనవని.. మైనర్లను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ భవ్య కిషోర్ హెచ్చరించారు. శుక్రవారం ప్రగతి సంస్థ తిరుపతి వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని డీఎస్పీ గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగతి కో–ఆర్డినేటర్ తులసిరామ్ రెడ్డి, మండల కో–ఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-తిరుచానూరు: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన దామినేడు సమీపంలోని చెరువు కట్ట వద్ద శుక్రవారం జరిగింది. గుర్తు తెలియని 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుచానూరు ఎస్సై సుబ్బయ్య పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలెం ఆర్చి వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేవీబీపురం మండలం అంజూరు ఎస్టీ కాలనీకి చెందిన వీరయ్యను అదుపులోకి తీసుకున్నారు. విజిలెన్స్ అధికారులు 20 బస్తాల బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకుని బుచ్చినాయుడుకండ్రిగ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు పంపారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్తు షాక్‌తో ఒకరి మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: బత్తలవల్లం పంచాయతీ చెదులుపాకం గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకంలో విద్యుత్ అలంకరణ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌కు చెందిన ఆశీర్వాదం మృతి చెందగా.. డానీ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం శ్రీకాళహస్తిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం ఏఎం పురం పంచాయతీ తడుకు రైల్వే స్టేషన్ వద్ద తిరుపతి–చెన్నై జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను అదుపుతప్పి ద్విచక్రవాహనం ఢీకొంది. టోల్ ప్లాజా హైవే అంబులెన్స్‌లో గాయపడిన పాదిరేడుకు గ్రామానికి చెందిన ముని వెంకటరమణ (45)ను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

మహిళా ఎఫ్‌బీవోపై అసభ్య ప్రవర్తన

ప్రజాశక్తి-దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల కేంద్రంలో వెదురుపట్టు బీట్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న షేక్ హస్రాతునిస అనే మహిళపై శుక్రవారం నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వరప్రసాద్ అసభ్యకరంగా ప్రవర్తించాడని దొరవారిసత్రం పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేశారు. తాను మే 31వ తేదీన బదిలీ అయ్యానని.. అప్పటినుంచి రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకపోగా శుక్రవారం ఇస్తానని తన ఆఫీసు రూమ్ కి రమ్మని చెప్పాడని.. భర్తతోపాటు వెళ్లగా జిరాక్స్ కాపీలు తీసుకురావాలని భర్తను పంపించి తనపై అసభ్యకరంగా ప్రవర్తించాడని బాధితురాలు వాపోయింది. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ తిరుమలరావు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్‌ను కలిసిన మిద్దెల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆప్కో మాజీ డైరెక్టర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మిద్దెల హరి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొదట కలంకారీ శాలువతో సత్కరించి ముక్కంటి తీర్థ ప్రసాదాలు అందించారు. పార్టీ ఆవిర్భావం నుంచి అవిరామంగా కష్టపడుతున్నందుకు తప్పక ఉన్నత స్థానం కల్పిస్తామని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి కషి చేయాలని జగన్ సూచించినట్లు మిద్దెల తెలిపారు. త్వరలోనే నామినేటెడ్ పదవి ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చినట్లు మిద్దెల చెప్పారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పూడి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తొట్టంబేడు ఎస్సై రాఘవేంద్ర శుక్రవారం సీజ్ చేశారు. పెన్నలపాడు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పూడి క్రాస్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు.

నేడు శ్రీకాళహస్తిలో నడ్డా బహిరంగ సభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శనివారం శ్రీకాళహస్తిలో పర్యటించనున్నారు. ముందుగా ఆ పార్టీ కీలక నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరుపుతారు. సాయంత్రం స్థానిక బేధవారం మండపం వద్ద ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడుతారు. శుక్రవారం బహిరంగ సభ జరుగు ప్రాంతాన్ని రాష్ట్ర భాజపా అధ్యక్షుడు సోము వీర్రాజు పరిశీలించారు. వారితో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ కుమార్, కో – కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, కొండేటి గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లీ బాబు, వేంకటేశ్వర్లు ఆచారి పాల్గొన్నారు.

పుత్తూరు పురపాలక సంఘము

టెండరు నోటీసు నెం. 10/ఇ1/2023-24 మునిసిపల్ కార్యాలయము, పుత్తూరు, తేది:08-06-2023

పుత్తూరు పురపాలక సంఘము

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు నెం.10/ఇ1/2023-24

పుత్తూరు పురపాలక సంఘము నందు పురపాలక సంఘ సాధారణ నిధులు నుండి 8 పనులకు గాను (నిట్ నెం.24/2023-24 & 34/2023-24 to 40/2023-24) రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి ఇ -ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనులకు సంబంధించిన పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమిషనరు
పుత్తూరు పురపాలక సంఘం